# సర్వస్వం

ఒక శారీరక అనుభవంతోనే స్త్రీ తనను తాను పూర్తిగా అర్పించుకుందని, ఆమె ఏమిటో తెలిసిపోయిందనుకునే మగ దురహంకారానికి షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చిన వైనాన్ని ప్రతిఫలించిన కథ ‘సర్వస్వం’. తనకు ఎదురయిన అవమానాల బారి నుండి తేరుకొని ఆత్మగౌరవంతో జీవితాన్ని ఉన్నతంగా మలుచుకున్న ‘గగన్’ ఈ తరం అమ్మాయిలకు స్ఫూర్తి దాయకం!!



కుప్పిలి పద్మ



లేతనీలం నీళ్ళ మీద మెరుస్తున్న బంగారం లాంటి యెండ.

శీతాకాల సాయంత్రపు రంగం మీదికి రాత్రి మంచు మేలిముసుగు తొడుక్కుని పారాడుతూ వస్తూంది. ఆహ్లాదకరమైన సన్నటి వణుకు వెన్ను పొడువునా జరజరా పాకుతోంది.

చిన్న కళ్ళ అమ్మాయి ఈత కొడుతోంది. అప్పటివరకు ఈతకొట్టి రెస్ట్‌ఛెయిర్‌లో రిలాక్స్‌డ్‌గా పడుకొని వుందో అమ్మాయి. పూల్‌కి మరోవైపు వో వైట్ పడుకొని పుస్తకం చదువుకుంటున్నాడు. లాన్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు జమైకన్ జంట. బటర్‌ఫ్లై విన్యాసాలు ముగించి నీళ్ళల్లోంచి బయటకి వచ్చాను. రెస్ట్‌ఛెయిర్ మీద కూర్చుని తెల్లని టవల్‌తో శరీరం మీద నీటిని అద్దుకొన్నాను. కాళ్ళు చాపుకొని కుర్చీలో పడుకొన్నాను.

స్టీవర్డ్ ఫ్రూట్‌జ్యూస్ తీసుకొచ్చి యిచ్చాడు.

“భలేవుంది మీ ఈత. ఎంజాయ్ చేసారా” దగ్గరకి వచ్చి చెప్పారు జమైకన్ జంట.

“థాంక్ యూ”

“ఇండియాలో చాలమందికి స్విమ్మింగ్ తెలియదు. ముఖ్యంగా ఆడవాళ్ళకి” డొమెస్టిక్ ఫ్లైట్‌లో విదేశీ ప్రయాణీకురాలు అందోసారి.

ఇంటాబయటా మనకు మనం నిలదొక్కుకోడానికి బోల్డంత ఈత కొట్టాలి కదా. యిక ప్రత్యేకంగా ఈత నేర్చుకునే సమయమూ లేదు. అవకాశమూ లేదు. అయినా ఆ ఈత ముందు ఈ ఈత ఎంత?

అయినా వో వయస్సు వచ్చాక తొక్కుడుబిళ్ళో, బంతాటో ఆడుకోవటమే నిషిద్ధం. ఇంక ఈత ఎక్కడ?

కొబ్బరాకుల సందుల్లోంచి శరీరంపై వాలుతోన్న లేతయెండ. అలసటపోయి కొత్తశక్తిని పుంజుకున్న వుత్సాహం. డ్రస్సింగ్ రూంలోకి వెళ్ళి డ్రస్ మార్చుకున్నాను. తల దువ్వుకొని రెస్టారెంట్ వైపు వెళ్ళాను.

“గుడ్ ఈవినింగ్” మెనూ కార్డు అందించింది సూపర్‌వైజర్.

గ్లాస్‌విండో నుంచి బయటకి చూస్తుంటే నీడలా పర్చుకొన్న యెండ.

“హాయ్ గగన్” పలకరిస్తూ షేక్‌హేండ్ యిస్తూ ఎదురుగా కూర్చున్నాడు సుమిత్.

“హాయ్”

“ట్రాఫిక్ జామ్” సంజాయిషీ యిచ్చాడు.

“కామన్ ప్రాబ్లమ్”

“మీక్కూడానా? చాలా ఫ్లైవోర్స్ వస్తున్నాయంటగా. కొన్ని పూర్తి అయ్యాయన్నారే”

“వూ”

బ్లాక్‌కాఫీ ఆర్డర్ చేశారు.

“సో. హౌ ఆర్ యూ” అడిగాడు సుమిత్.

“టీకే..మీరు”

“ఆల్‌రైట్. కాన్ఫరెన్స్‌కి మీరు వస్తున్నారని తెలిసింది. చాలకాలం తర్వాత కలిసారా. అఖిల్ ఎలా వున్నారు? వో శాటిలైట్ ఛానల్ తీసుకున్నాం. మీకు తెలుసు కదా. ఛైర్‌మెన్‌తో మాట్లాడటానికి అరేంజ్‌మెంట్ చేస్తాం. మీ ఏరియా నుంచి మంచి బిజినెస్‌ని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం. మీరెవరినైనా సజెస్ట్ చేస్తారా? అలానే మీ ఏరియాలో జండర్ సెన్సిటివిటీ మీద వోరియంటేషన్ క్లాసెస్ ఎరేంజ్ చేద్దాం అనుకుంటున్నాం” అన్నాడు.

“ఎవరైనా ప్రపోజల్స్ పంపించారా?”

“వూ...నాలుగైదు ప్రపోజల్స్ వచ్చాయి. అందులో మురళి ప్రపోజల్ బాగుంది” అన్నాడు.

“మురళికి ప్రపోజల్ రాయటం బాగవచ్చే! లేక బాగరాయగలిగేవాళ్ళు తెలుసో తెలియదు. కాని అతనికేం సెన్సిటీవ్స్ లేవు వొకప్పుడు. కాన్ఫరెన్స్‌కి అతనూ వచ్చారు”

“ఏసీ. మీ వెంచర్‌కి ఎవరిస్తున్నారు”

“రీజన్‌వైజ్‌గా ఆనంద. మొత్తం ప్రోగ్రామ్‌కి త్రీ క్లాసెస్ అపర్ణాఘోష్ యిచ్చారు. కొత్త వెంచర్‌కి యిప్పుడు డిసైడ్ చెయ్యాలి”

“సో. వెళ్లేలోగా మళ్లీ కలుద్దాం” అన్నాడు సుమిత్.

ష్యూర్. వెళదామని అనుకుంటుండగా “కాఫీ తాగుదామా” అంటూ వచ్చాడు మురళి.

“నో. థాంక్ యూ” అంటూ అతనిని పట్టించుకోకుండా బయటికి వచ్చేసాను.

సుమిత్ వెళ్ళిపోయాడు.

“అసలు తెలియనట్టే ప్రవర్తిస్తావేం. ఎలా పడ్డావ్ నా వెంట. హాస్టల్లో నా గదిముందు తలుపు తీయవా అంటూ ఏడుస్తు ఎలా నిలబడేదానివి. ఇప్పుడు మేం ఎందుకు గుర్తుంటాం. నా బుక్స్ పట్టుకెళ్ళి చదివేదానివి. పోనీలే. నీ సర్వస్వం మొదట నాకేగా అర్పించావ్. ఆ క్రెడిట్ నాదేగా. అసలు అప్పుడు నువ్వు అడిగినట్టు నిన్ను పెళ్లి చేసుకొని వుంటే నువ్వీ పొజిషన్‌లోకి వచ్చుండేదానివా?” అంటున్నాడు మురళి.

లిఫ్ట్ డోర్ తెరుచుకుంది.

“అప్పటికంటే రంగు తేలావ్. కండపట్టావ్. మందు కొడుతున్నావా? ఈత నేర్చుకున్నట్టున్నావ్? సిగరెట్స్ కాలుస్తున్నావా?”

ఫోర్త్‌ఫ్లోర్‌లో లిఫ్ట్ ఆగింది.

రూం లాక్ తీసి లోపలికి వెళ్ళబోతుంటే అతనూ రాబోయాడు. తలుపు వేసేసాను.

టి.వి. ఆన్ చేసాను. బి.బి.సి. సి.ఎన్.ఎన్. స్టార్...న్యూస్...స్టోరీస్ ..బిజినెస్ న్యూస్. మనసు డాలర్స్‌పై, పౌండ్స్ పై నిలవటం లేదు.

మురళి!!

అవే మాటలు. అదే మనిషి. పదేళ్ళకాలం అతనిలో ఏ మార్పుని తీసుకురాలేదు. ఇతను జండర్ సెన్సిటివిటి మీద వోరియంటేషన్ క్లాసెస్ తీసుకుంటాడు. చిన్నాచితకా సెక్షన్స్‌కి కాదు. ఫైగా రోల్ మోడల్‌గా తయ్యారయ్యాడు.

యూనివర్శిటీకి వచ్చిన తొలిదినాలు. సిటి కొత్త. కుతూహలం. బెరుకు. మురళి ప్రేమ అన్నాడు. అదే ప్రేమ అనుకున్నాను. పెళ్లి చేసుకుందాం అన్నాడు. నిజమనుకున్నాను. కులం మతం అంతా రాజకీయం అన్నాడు. సరిగ్గా అర్థం కాలేదు. కాని అతనికి కులమతాల పట్టింపులేదని అంటున్నాడు అనుకున్నాను. ప్రేమ తప్పా ఈ ప్రపంచంలో ముఖ్యం కాదనిపించేది. హాస్టల్లో మురళి గదిలోనే కలుసుకునేవాళ్ళం. వొక్కరోజు శారీరకంగా దగ్గరయ్యాం. తర్వాత కొద్దిరోజులకే మురళి మరో అమ్మాయితో గదిలో కనిపించాడు. ప్రేమంటే కచ్చితంగా పెళ్ళి చేసుకోవడమేనని నమ్మానేమో మురళి ప్రవర్తనని భరించలేకపోయాను.

“ఎందుకిలా చేస్తున్నావ్”

"నా యిష్టం"

"మనం పెళ్ళి చేసుకుందాం అనుకున్నాంగా"

"అనుకుంటే"

"మరి ఈ పనేంటి?"

"నా యిష్టం"

"ఏంటి నీ యిష్టం! ఇలా ప్రవర్తిస్తే ఎంత బాధగా వుంటుంది."

"బాధపడితే నీ సమస్య. నాకేం సంబంధం. నేనెలా ప్రవర్తించాలో నువు చెపుతావేంటి? మా పక్క రూమ్మేట్ ప్రస్తుతం ఖాళీగానే వున్నాడు. వెళ్ళు. ఎవరు ఎవరితోనైనా వెళ్ళే రైట్ వుంది. ఇంకెప్పుడు నా విషయంలో కలగ చేసుకోకు"

"ఎంత కేర్‌లెస్‌గా మాట్లాడుతున్నావ్"

"కేర్ చేయడానికి యింకా నీలో ఏముందిలే. నీ వెంట తిరగటానికి వున్న శరీరమూ ఇచ్చేసావ్, యింకా ఏముంది నీలో. ఏయ్ పో, ఏడవకు. చిరాకు" గదిలోంచి బయటకి నెట్టేసి తలుపు వేసేసుకున్నాడు.

కాసేపు తలుపు దగ్గరే నిలబడి తట్టాను. తలుపు తీయలేదు. కసి. అవమానం. నా కోపాన్ని బాధని అసహ్యాన్ని అతనిపై ఎలా కుమ్మరించాలో తెలియలేదు.

స్నేహం, ప్రేమ, పెళ్ళి అని చుట్టూ తిరిగింది అతను. పెళ్ళి చేసుకోమని సతాయిస్తున్నానని తన స్నేహితులందరి ముందు చిత్రించి అవమానిస్తుంటే ఏడవటం తప్పా ఏమి తెలియనితనం. అతని స్నేహితులు అతనిలాంటివారే. వాళ్ళందరి ప్రవర్తనలో తేడా లేనితనం.

అతనొట్టి ఫూల్ అని తెలుస్తుంటే ఎందుకలా ఏడుస్తావ్?

ఓదార్చుకున్న ఆగని గుండెరొద.

ఇంత అవలీలగా అవమానానికి లోనయ్యాను?

దహించివేస్తున్న అవమానం.

బోల్డంతమంది ఆడపిల్లలు చుట్టూ. ఎవ్వరితోనూ ఈ విషయం షేర్ చేసుకోలేదు. అతను తిరస్కరించటం ఆ మాటలు ఇలానే ఆలోచనలు.

ప్రపంచంలో అతనిని బాధించే విషయం ఏది లేనట్టుంది. ఏం చేస్తే అతనికి నా బాధ అర్థం అవుతుంది?

చావు తప్పా అతనిని ఏదీ బాధపెట్టలేదేమో?!

నిద్రమాత్రలు మింగేసాను.

* * *

హాస్టల్లో నా గది.

"ఈ అమ్మాయి పేరు శారద. నీలానే వూరు నుంచి హాస్టల్‌కి వచ్చింది. ఆనంద్‌కుమార్ ప్రేమ కురిపించాడు. అతనిని హాస్టల్లో అతని గదిలోనే కలిసేది. శారదకి ఆనంద్ కుమార్‌ని అంచనా వేయటం రాలేదు. అలా వెయ్యాల్సిన అవసరమూ కనిపించలేదు. అతనికి చాలమంది అమ్మాయిలతో సంబంధాలుండేవి. వాళ్ళంతా యూనివర్శిటీ అమ్మాయిలు కారు. సో శారదకి అసలు ఈ విషయం తెలియకుండాపోయింది. శారదని విపరీతంగా హ్యుమిలియట్ చేసాడు. శారద ఏమనుకుందో ఏమో. అతనికి బుద్ధి చెప్పాలనుకుందో ఏమో తెలియదు. ఆమెది ఆత్మహత్య అని కొందరు. ఆనంద్‌కుమార్ చేసిన హత్య అని కొందరు అన్నారు. అంతా కలిసి ఆ ఇష్యూ మీద పని చేసాం. చేస్తున్నంతసేపు నాకేమో గిల్టీగా అనిపించేది. బాధ. బతికివుండగా మనమంతా ఎందుకు కలవలేకపోయాం? మగవాళ్ళు విసిరే నమ్మకాలు వురితాళ్ళు అవుతున్నాయి. వాటిని తెంపేసే నమ్మకాన్ని ఆడవాళ్ళం మనలో మనం ఎందుకు పెంచుకోలేకపోతున్నాం? ఆ తర్వాత వో రేప్‌కేస్‌లో పనిచేసాం. ధైర్యంగా సాక్ష్యం యిచ్చారు. సాక్ష్యం చెప్పినవాళ్ళని బెయిల్ మీద బయటికి వచ్చిన అతను బెదిరించటం మొదలుపెట్టాడు. అయినా మేం ఎవ్వరం బెదిరిపోలేదు. చెదిరిపోలేదు. ఇష్యూస్ మీద పనిచేస్తూనే వున్నాం. మురళిలాంటివాళ్ళు ఎక్కడ చూసినా కనిపిస్తారు. వాళ్ళని గుర్తుపట్టి దూరంగా వుంచే స్కిల్స్‌ని మనం తెచ్చుకోవాలి. కాఫీ తాగుతావా" అడిగింది ఆర్తిసేన్.

కాఫీ యిచ్చింది.

"ఎలా తెలుసు" శారద ఫోటో నుంచి చూపులు తిప్పుకుంటు అడిగాను.

"ఏంటి?"

"మా ఇష్యూ"

"అలా తెలుస్తునే వుంటాయి"

"రిసెర్చ్ స్కాలర్స్ హాస్టల్లో అమ్మాయిలకి మా విషయం తెలుసా? ఎవరికి తెలుసు? అందరికి తెలుసా? ఇంతమందికి తెల్సిపోయిందా?"

"ఆలోచనలు వదిలై. క్లాస్‌కి వెళతావా?"

"క్లాస్‌కా? నేనిలా చేసానని అందరికి తెలిసిపోయిందిగా"

"తెలిస్తే? తెలియని. మురళి మీద సుజన కంప్లైయింట్ యిచ్చింది"

"ఏమని"

"నీకు చెప్పిన మాటలే కాస్త అటుఇటుగా సుజనకి చెప్పాడు. నీ విషయం సుజనకి తెలుసు. కానీ నువ్వే వెంటపడుతున్నావన్న అతని మాటలు నమ్మింది. అతను ఆమెతో బాగుంటాడని నమ్మింది. అలా అనుకోవటంలో ఆమెకి కొంత కంఫర్ట్ వుందేమో. కాని మురళి తనేమిటో ఎక్కువ కాలం దాచుకోలేదు. సుజన అతనిని వదిలిపెట్టాలనుకోవటం లేదు. వీలైతే నువ్వు ఆలోచించు. రెడి అయి క్లాస్‌కి వెళ్ళు. ఎప్పుడోకప్పుడు ఎక్కడో దగ్గర జీవితాన్ని తిరిగి మొదలుపెట్టాలిగా"

ఆర్తిసేన్ గదిలోంచి బయటకి వెళ్ళినా ఆమె జీవశ్వాస పరిమళం మాత్రం ఇంటిమేట్‌గా వుండిపోయింది.

* * *

ఆర్తికి కృతజ్ఞతలు చెప్పాలనిపించేది. కాని ఎప్పుడూ చెప్పలేదు. విషయాలని షేర్ చేసుకోవటానికి మొహమాటంగా వుండేది. వో రోజు ఆర్తి "జీవితాన్ని సీరియస్‌గా తీసుకోవటం, విషయాలని సెన్సాఫ్ హ్యూమర్‌తో డీల్ చేయటం మా అమ్మ నుంచి నాకొచ్చింది. నా తండ్రి ఎవరో నాకు తెలియదు. తెలుసుకోవాలని ఎప్పుడు అనిపించలేదు. మా అమ్మ వో రేప్ విక్టిమ్. అలా పుట్టాను. ఇది దాచి వుంచాల్సిన విషయమని అమ్మా అనుకోలేదు. నేనూ అనుకోలేదు. విషయాలని పంచుకున్నప్పుడు కొన్నిసార్లు ఆ ఇన్‌ఫర్‌మేషన్‌తో అటాక్ చేస్తారు. అయినా మనం ఎదుర్కోగలం అనుకున్నప్పుడు, నమ్మకం వున్నప్పుడు షేర్ చేసుకోవచ్చు. అయితే ప్రైవసీకి బహిరంగపర్చటానికి తేడా అనుభవం నుంచే తెలుసుకోవాలి" అంది.

అలా అలా మురళి....నిద్రమాత్రలు.... ప్రేమ....పెళ్ళి...మోసం...ఎటో వెళ్లిపోయి ఆ అనుభవం తిరిగి ఎప్పుడూ ప్రేమా అని అవమానపు దారుల్లోకి వెళ్ళనీయలేదు. వ్యక్తిత్వాన్ని ఎన్‌రిచ్ చేసే ప్రేమని గుర్తించగలిగాను.

ఇదిగా ఇన్నాళ్ళకి తిరిగి యిక్కడ మురళి యిలా కనిపించి అలానే మాట్లాడుతున్నాడు.

ఏం చెయ్యాలి అనే ఆలోచనే రావటం లేదు.

లోపలంతా కంపరంగా లేదు.

రిసీవర్ తీసి నెంబర్ డయిల్ చేసాను.

హ....లో....ఆర్తి స్వరం గట్టిగా.

"థాంక్‌యూ"

"ఎవరు?"

"థాంక్‌యూ"

వో సెకన్ తర్వాత గట్టిగా పర్వశంగా ఆర్తి నవ్వు.

"ఎట్‌లాస్ట్ - తిరిగి గుక్కతిప్పుకోకుండా నవ్వుతూ "జండర్ సెన్సిటివిటీ అంటే ఏంటి?" విమెన్ సాలిడారిటీ అంటే ఏంటి మమ్మీ అని అడుగుతోంది నా కూతురు. మార్చి 8. స్కూల్లో ఎస్సే కాంపిటీషన్. ఎలక్యూషన్. సో థాంక్స్....తట్టాబుట్టా సర్దుకోకుండా క్లాస్‌కి వెళ్ళావుగా. ఆ రోజే చెప్పేసావ్. హార్స్ రైడింగ్‌లో జాయిన్ అయ్యాను. భలే వుంది....చెపుతోంది ఆర్తి. రిసీవర్ క్రెడిల్ చేసి టి.వి.పై చూపు నిలిపాను. నిలవటం లేదు. పసుపుపచ్చని పూల పక్కన వొద్దిగ్గా కవర్. తిరిగి ఆ కవర్లోంచి కాగితాన్ని బయటకి తీసాను.


**ఎంతసేపు నీతో గడిపినా లెక్కపెట్టటానికి యింకా**
**మిగిలిపోయిన నక్షత్రాల్లా బోల్డన్ని విషయాలు**
**వుంటునే వుంటాయి. ఎప్పటికైనా నువ్వు పూర్తిగా అర్థం**
**అవ్వటం సాధ్యమా? జీవనంలో ఆనందమూ విషాదమూ,**
**యిరుకు విశాలత్వం కలిసే**
**వుంటాయని ఆ జీవితాన్ని జీవించటంలోనే**
**జీవనసాఫల్యం దొరుకుతుందని మరణం చివరి**
**వరకు జీవనారంభంలోనే వెళ్లొచ్చిన నీ**
**అనుభవం జీవితాలని సుసంపన్నం చేస్తుంటే**
**గగన్ - నిజం చెపొద్దూ కోటి కలల కిక్కిరిసిన**
**నీ కన్నుల మీద-**
**లక్షముద్దుల కోసం పరుచుకున్న**
**నీ అర్ధచంద్రుడి నుదుటిమీద**
**నాకు**
**కవిత్వం కవిత్వంగా వుంది**
**ఎడతెగని**
**మోహం మోహంగా వుంది.**
**I love you.**

**- అఖిల్**

మురళి ఏమన్నాడు? ఏముంది నీలో? నీ సర్వస్వం నాకిచ్చేసావ్? ఏముందింకా నీలో? నీ వెంటపడి తిరగడానికి? పెళ్ళికి? ప్రేమకి? అఖిల్ ఏమన్నాడు? ప్రేమో స్నేహమో యిష్టమో. ఎప్పటికైనా నువ్వు పూర్తిగా తెలుస్తావా?

వొక్క శారీరక అనుభవంతో సర్వస్వం తెలిసిపోయావు అని తూలనాడిన మురళి? అసలు నువ్వు ఎప్పటికైనా తెలుస్తావా అని ఆరాధించే అఖిల్. అసలు ఎవరికైనా ఎవరైనా పూర్తిగా తెలియటం వుంటుందా?

ఫోన్ మోగింది.



"హేయ్ గగన్. రేపటికి మన పార్టనర్స్ లిస్ట్ ఫైనలైజ్ చేయటం అయిపోతుంది కదా" సంజయ్‌కపూర్ అడుగుతున్నాడు.

"రేపు వుదయం వరకు ఎందుకు. కాసేపట్లో యింటర్వ్యూస్ వున్నాయి. అవ్వగానే హాట్‌లైన్‌లో ఫైనల్‌లిస్ట్ చూసుకోవచ్చు. ఫోన్ చేస్తా"

"థ్యాంక్ యూ. సీ యూ"

సంజయ్ మంచి ప్రొఫెషనల్‌పర్సన్. అతని దగ్గర పనిచేయటం మొదలుపెట్టాక చాల విషయాలని క్రమపద్ధతిగా చేయటం నేర్చుకున్నాను. అతను విలువలతో క్రమశిక్షణతో పనిచేయటం వల్లే అతనీ రోజు అతని ఫీల్డ్‌లో సక్సెస్‌ఫుల్‌పర్సన్.

కాన్ఫరెన్స్ హాల్‌కి వెళ్ళాను.

యింటర్వ్యూస్ పూర్తిచేసి లేప్‌టాప్ తెరిచాను. తిరిగి మరొక్కసారి అందరికి సంబంధించిన ఫైల్స్‌ని చూసుకున్నాను. రిపోర్ట్ పూర్తి చేసి సంజయ్‌కపూర్‌కి కాల్‌చేసాను.

"యస్ గగన్"

"ఫైనల్ రిపోర్ట్ చూసుకోవచ్చిప్పుడు. ఏమైనా క్లారిఫికేషన్స్ వుంటే క్లియర్ చేస్తా"

కాసేపటి తర్వాత సంజయ్ లైన్‌లోకి వచ్చి "గుడ్. ఎగ్రిమెంట్ చేసుకోవచ్చు. నిన్ను మెచ్చుకోకుండా వుండలేకపోతున్నా. జండర్ సెన్సిటివిటీ లేని వాళ్ళ ఫైల్స్‌ని రిజక్ట్ చేసినందుకు. ఇప్పుడేం చేద్దాం. స్టేట్ హెడ్స్‌కి ఆర్గనేజేషన్ హెడ్స్ అందరికి ట్రయినింగ్ యిద్దామా"

"సంజయ్, మన కాంట్రిబ్యూటర్స్ ఎక్కువగా స్త్రీలే. ఎక్కడెక్కడో మారుమూల ప్రాంతాలలోకి వెళ్లి బోల్డంత మెటీరియల్‌ని అందిస్తుందంతా స్త్రీలే. వాళ్ళందరికి మనం అనేక విషయాలలో ట్రెనింగ్ యిస్తున్నాం. అలానే జండర్‌సెన్సిటివిటి లేకపోతే ఎవరికి ఏ ట్రయినింగ్ యిచ్చినా ప్రయోజనం ఏముంది. వాళ్లకి యిస్తే తీసుకుంటారా?"

"ఈసారి వాళ్ళకి ట్రయినింగ్ యిద్దాం. నో అంటే మనం అగ్రిమెంట్ కాన్సిల్ చేసుకుంటాం. ఆ క్లాజ్‌లో అగ్రిమెంట్ రెడి చేయించండి. గుడ్. రియల్లి గుడ్. సీయూ. గుడ్‌నైట్"

"గుడ్‌నైట్"

నిశ్శబ్దం. మబ్బు వెలుగు. చల్లదనం. పల్చనిపూల పరిమళం.... దిండుకి తల ఆనిస్తుండగా ఫోన్ మోగింది.

"ఇంటర్వ్యూ ఎలా చేసావ్" ఆర్తిసేన్ స్వరంలో ఆసక్తి.

"అయిపోయింది"

"కమాన్. చెప్పు. చెప్పు"

"యూ క్రేజి"

"గగన్, అనేక వర్క్‌షాప్స్‌లో నిన్ను చూసాను. అతన్ని చూసాను. ముఖ్యంగా నీ యింటర్వ్యూ వినాలనుకోవటంలో ప్రొఫెషనల్, పర్సనల్ ఆసక్తి. చెప్పు. చెప్పు."

యింటర్వ్యూ బోర్డులో ముగ్గురం వున్నాం. మురళి వచ్చాడు. నేవీ బ్లూసూట్.

"రేమండ్ సూట్"

"వూ" కనురెప్పలు ఆర్పి విప్పుతు అన్నాడు.

"ఎర్రనిగీతతో అండర్‌లైన్ చేసిన రేమండ్ క్యాప్షన్ 'కంప్లీట్‌మేన్' నిచూసి ఇన్స్‌ఫైయిర్ అయ్యారా?"

"హా. ఆఫ్‌కోర్స్" భుజాలు ఎగరేస్తు చెప్పాడు.

"జండర్ సెన్సిటివిటి అంటే ఏమిటి?"

"జండర్ సెన్సిటివిటీ....జండర్ సెన్సిటివిటీ....39 దేశాలలో సెమినార్స్‌లో పాల్గొన్నాను. 176 వర్క్‌షాప్స్ కండక్ట్ చేసాను. అలాంటి ఇలాంటి సంస్థలకి కాదు. మీరేమో జండర్‌సెన్సిటివిటి అంటే ఏమిటని అడుగుతున్నారు. చాల తేలికైన చిన్ని ప్రశ్న"

"నిజమే! చిన్ని ప్రశ్న. తేలికప్రశ్న. వో.కే. మిస్టర్ మురళి సర్వస్వం అనే దానికి జండర్ వుంటుందా?"

మురళి కనుబొమ్మల చివర్లు దగ్గరకి అయ్యాయి.

"ఇదీ చిన్ని ప్రశ్నలానే వుందా మిస్టర్ మురళి. వో.కే. సర్వస్వం అనేది ఆడవాళ్ళకే వుంటుందా? మగవాళ్ళకి వుంటుందా? మగవాళ్ళకి వుంటే అదేమిటి?" మురళి కళ్ళు చిట్లుతున్నాయి. చిన్నగా కదిలిన పెదవి వెనుక పళ్ళు బిగుసుకుంటున్నాయి.

"థాంక్‌యూ వెరిమచ్ మిస్టర్ మురళి. ఇక మీరు వెళ్లొచ్చు" అన్నాను.

లేవలేకపోయాడు మురళి.

"అందికే అడిగాను. చూసావా. ఇది నాకెప్పుడు తట్టని ప్రశ్నలు. నువ్వు మాత్రమే అడగ్గలిగే ప్రశ్నలు. అవమానం నుంచి నువ్వు ఎదిగిన తీరు....ఐ లవ్ యూ గగన్ ఐ లవ్ యూ" అంటోంది. ●

# భాషా స్వభావానికి అనుగుణంగా మార్పులు

సంస్కృతం నుండి మాటలు తెలుగులోకి వచ్చినప్పుడు కొన్ని మార్పులు పొందుతాయి. సంస్కృతమే కాదు ఏ భాష నుండి మరేభాషలోకి పదాలు వెళ్లినా ఆ భాషా స్వభావానికి అనుగుణంగా కొన్ని మార్పులు పొందితీరుతాయి. సంస్కృతంలో ప్రతిపదమూ ప్రత్యయాంతమై ఉంటుంది. అంటే పదం చివర ప్రత్యయం ఉంటుంది. ఉదాహరణకు ఏదైనా ఒక నామవాచకాన్ని తీసికొన్నామనుకోండి. ఆ నామవాచకం ప్రథమావిభక్తిలో ఉందా మరేదైనా విభక్తిలో ఉందా, పుంలింగమా, స్త్రీలింగమా, నపుంసక లింగమా, ఏక వచనంలో ఉందా; ద్వివచనంలో ఉందా, బహువచనంలో ఉందా అన్నదాన్ని బట్టి దాని రూపం ఉంటుంది. విభక్తి, లింగం,వచనం తెలిపే ప్రత్యయం పదం చివర ఉంటుందన్నమాట.

మనభాష - 15



టి.చంద్రశేఖర రెడ్డి

ఈ ప్రత్యయంతో ఉన్నపదాన్ని తెలుగులోకి యథాతథంగా తెచ్చుకోము కదా. ఆ మాటను తెలుగువాక్యంలో తెలుగు మాటలాగా వాడుకోవాలి. అందుకోసం ఆమాటకు తెలుగు ప్రత్యయం చేర్చుకోవాలి. లేకపోతే తెలుగుమాటల రూపం కల్పించుకోవాలి.

సంస్కృతంలో ఒక పదం పుంలింగమా, స్త్రీలింగమా, నపుంసక లింగమా అనేది పదం స్వరూపం మీద ఆధారపడి ఉంటుంది. అర్థానికి సంబంధం లేదు. దారా అంటే భార్య. ఇది పుంలింగం. భార్య అనేమాట స్త్రీ లింగం. కళత్రం అన్నా భార్యే. ఇది నపుంసకలింగం. వృక్ష శబ్దానికి చెట్టు అని అర్థం. ఇది పుంలింగం. నాసిక అంటే ముక్కు. ఇది స్త్రీ లింగం. విద్యా అంటే చదువు. ఇది స్త్రీ లింగం. మిత్ర శబ్దం నపుంసకలింగం.

తెలుగులో లింగం అర్థాన్ని బట్టి ఉంటుంది. పురుషుణ్ణి బోధించే పదాలను మహత్తులనీ, తక్కినవాటిని అమహత్తులనీ అంటాం. సంస్కృతంలో పుంలింగం అయి ఉండీ పురుషుణ్ణి బోధించని మాట తెలుగులో అమహత్తే అవుతుంది. సంస్కృతంలో నపుంసక లింగమయినా పురుషుణ్ణి బోధించేదయితే తెలుగులో మహత్తు అవుతుంది. ఈ కారణాలవల్ల సంస్కృత పదాలు తెలుగులో మార్పులను పొందుతాయి.

సంస్కృతం నుండి తెలుగులోకి వచ్చిన పురుషవాచకశబ్దాల చివర 'డు'ప్రత్యయం చేరుతుంది. రాముడు, కృష్ణుడు,భీముడు మొదలయిన పేర్లెన్నయినా చూపవచ్చు. ఇది అకారాంత శబ్దాలతో జరుగుతుంది. 'రామ'కు 'డు' చేరి రామ లో మకారం మీది అత్వం ఉత్వం కావడం వల్ల రాముడు ఏర్పడుతుంది. ప్రాచీనకాలపు శాసనాలలో రామండు, భీమండు వంటి రూపాలు కూడా కనిపిస్తాయి. పదం చివరి 'అ' 'ఉ'గా మారి 'డు' చేరని రూపాలు కూడా కనిపిస్తాయి. ఉదాహరణకు పండరంగు.

పూర్వం మనవాళ్ల పేర్లు అయ/అయ్య, అన/అన్న, అప/అప్ప వంటి అనుబంధ పదాలతో కూడి ఉండేవి. నన్నయ, తిక్కన, కేతన, మారన, ఎర్రన, సోమన వంటి మన కవుల పేర్లు ఇందుకు ఉదాహరణలు. అథర్వణుడు, భాస్కరుడు, శ్రీనాథుడు, రామభద్రుడు, రామరాజభూషణుడు వంటి పేర్లు తరువాతి కాలంలో ప్రచారంలోకి వచ్చినా ఇప్పటికీ అయ్య/అన్న/అప్పలతో అంతమయ్యే పేర్లే ఎక్కువ.

కందుకూరి వీరేశలింగం పంతులుగారి 'రాజశేఖర చరిత్ర' నవలలోని నాయకుడు రాజశేఖరుడు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో డు ప్రత్యయాంతమయిన పేర్లు పెట్టుకుంటూనే ఉన్నారు. రాముడు, లక్ష్మణుడు, చక్రధరుడు వంటి పేర్లు కనిపిస్తూనే ఉంటాయి. మన శాసనసభాపతి యనమల రామకృష్ణుడుగారి పేరు ఇందుకు మంచి ఉదాహరణ. రామకృష్ణయ్య, రామకృష్ణప్ప, రామకృష్ణరావు, రామకృష్ణశర్మ, రామకృష్ణమూర్తి, రామకృష్ణశాస్త్రి, రామకృష్ణుడు మొదలయిన విధంగా పేర్లు పెట్టుకోవచ్చు. కాని ఇప్పుడు రామకృష్ణ, రామచంద్ర, నారాయణ, కృష్ణ వంటి పేర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శ్రీనివాస్, శంకర్, లక్ష్మణ్, ప్రసాద్ వంటి హలంతమయిన పేర్లు కూడా ఎక్కువవుతున్నాయి. ప్రసాద్‌ని అజంతం చేసి ప్రసాదు అంటున్నాం. ప్రసాదం, ప్రసాదరావు, ప్రసాదుడు మొదలయినవాటికి ముందు సామాన్యంగా 'వర' అనేమాట ఉంటుంది. వరప్రసాదం, వరప్రసాదరావు, వరప్రసాదుడులాగా. ఎవరి వరం? అని ప్రశ్నించుకుంటే సత్యనారాయణ వరప్రసాద్, కృష్ణవరప్రసాద్, వీరవేంకటసత్య వరప్రసాద్ వంటి పేర్లలో సమాధానం కనిపిస్తుంది. వర లేకుండా కేవలం కృష్ణప్రసాద్, రాంప్రసాద్, శివప్రసాద్, దుర్గాప్రసాద్ అని కూడా ఉంటాయి. ప్రసాదు అన్న మాటను సంక్షిప్తలేఖనంగా కొంతకాలం కిందట చమత్కరించిన వాళ్లూ లేకపోలేదు.

ఏది ఏమయినా అయ్య/అన్న/అప్ప/రావు/రెడ్డి/నాయుడు/శర్మ/శాస్త్రి/మూర్తి/చౌదరి/బాబు/ఆచార్యులు వంటి అనుబంధపదాలు కాని 'డు' ప్రత్యయం కాని లేని ఇటువంటి పేర్లు మనభాషకు సహజమయినవి కావేమో.

'డు' ప్రత్యయం లేకుండా గౌరవార్థకంగా బహువచన ప్రత్యయం'లు' చేర్చి పేరు పెట్టుకొనే పద్ధతి కూడా ఉంది. శ్రీరాములు, వేంకటేశ్వర్లు, ఆంజనేయులు, శ్రీనివాసులు వంటి పేర్లు ఇటువంటివి.

పై మాటలన్నీ పేర్లకు సంబంధించినవి. ఇవి కాకుండా 'డు' ప్రత్యయం చేరేమాటలెన్నో ఉన్నాయి. నాయకుడు, భక్తుడు,వీరుడు, ధీరుడు, బుద్ధిమంతుడు, శక్తిమంతుడు, జ్ఞానవంతుడు, సాహసికుడు, బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు, వైద్యుడు, ఉపాధ్యాయుడు, అధ్యాపకుడు, ఆచార్యుడు మొదలయినవన్నీ 'డు'ప్రత్యయం చేరి తత్సమాలయిన శబ్దాలే.

మంచినడవడి కలవాడు సచ్చరిత్రుడు, చెడు నడవడి కలవాడు దుశ్చరిత్రుడు. విమర్శచేసేవాడు విమర్శకుడు. సమీక్ష చేసేవాడు సమీక్షకుడు. సభలో పాల్గొనేవాడు సభ్యుడు. ఇప్పుడు చాలామంది ఈ అర్థంలో వాడుతూ ఉన్న 'సభికుడు' అన్నమాటకు జూదగాడు అని అర్థం. సభ్యుడు, సదస్యుడు, సభాసదుడు అన్నమాటలు వాడవచ్చు. నటించేవాడు నటుడు. దర్శనం తెలిసినవాడు దార్శనికుడు. ఇట్లా అసంఖ్యాకంగా పదాలు ఏర్పరచుకోవచ్చు. ●